సాక్షి తిరుపతి

బుధవారం ၊ 16 ၊ అక్టోబర్ ၊ 2024



నకిలీల రాజ్యం..

జిల్లాలో నకిలీ కేటుగాళ్లు రాజ్యమేలుతున్నారు. నకిలీ విత్తనాలు, ఎరువులు రైతులకు అంటగడుతున్నారు. - 10లో



'పచ్చ'పైత్యం!

అధికార పార్టీ 'పచ్చ'పైత్యంతో రెచ్చిపోతోంది. శిలాఫలకాలకు సైతం పచ్చరంగు అద్ది శునకానందం పొందుతోంది. - 10లో



'కోన' కనువిందు!

చంద్రగిరి నియోజకవర్గం, ఎర్రావారిపాళెం మండలంలోని తలకోన జలపాతం కనువిందు చేస్తోంది. - 10లో

న్యూస్‌రీల్

నూతన కార్యవర్గం ఎన్నిక



ఏపీ ప్రభుత్వ ఐటీఐ, డీఎల్‌టీసీ ఉమ్మడి చిత్తూరు జిల్లా నూతన కార్యవర్గం

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుచానూరు రోడ్డు, పద్మావతీపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సోమవారం ఏపీ ప్రభుత్వ ఐటీఐ/డీఎల్‌టీసీ ఉమ్మడి చిత్తూరు జిల్లా సంఘం నూతన కార్యవర్గాన్ని జిల్లా ఎన్‌జీఓల సంఘం అధ్యక్షులు సురేష్‌బాబు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా నిర్వహించారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఏ.రాజు (తిరుపతి), ఉపాధ్యక్షులుగా సీ.వరదాంజనేయులు (తిరుపతి), పీ.జనార్దన (తిరుపతి), కార్యదర్శిగా పీ.సోమశేఖర (తిరుపతి), సంయుక్త కార్యదర్శులుగా వీఎస్.ధనలక్ష్మి (చిత్తూరు), సీ.గంగాధరం (తిరుపతి), కోశాధికారిగా ఎం.రవీంద్రారెడ్డి (చిత్తూరు), కార్యవర్గ సభ్యులుగా కే.బాలమురళీప్రసాద్ (పీలేరు), డీ.లక్ష్మీకుమార్ (తిరుపతి), ఎస్.వివేక్ (చిత్తూరు), జీ.గోవిందయ్య (తిరుపతి) ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

18న ఈ-పంట తుది జాబితా

తిరుపతి అర్బన్: ఖరీఫ్‌నకు సంబంధించి వ్యవసాయశాఖ నేతృత్వంలో ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని 1,35,585 ఎకరాల్లో చేపట్టినట్లు డీఏఓ ప్రసాద్‌రావు తెలిపారు. మంగళవారం ఆయన సోషల్ ఆడిట్‌కు సంబంధించి చేపట్టాల్సిన పలు అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ నెల 10 నుంచి 16వ తేదీ వరకు ఆయా రైతు సేవా కేంద్రాల్లో సామాజిక తనిఖీల కోసం గ్రామసభలు నిర్వహించి ఈ-పంట వివరాలను ప్రదర్శించాలని తెలిపారు. తప్పులు ఉంటే వాటిని సవరించుకోవాలని రైతులకు సూచించారు. ఈ నెల 18న తుది జాబితాను రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించనున్నట్టు ఆయన స్పష్టం చేశారు.

శ్రీవారి దర్శనానికి 20 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ నిండాయి. క్యూలైను ఏటీసీ వద్దకు చేరింది. సోమవారం అర్ధరాత్రి వరకు 75,361 మంది స్వామివారిని దర్శించుకోగా 28,850 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.91 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 20 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.



తూపిలిపాళెం సముద్ర తీరంలో ఉవ్వెత్తున ఎగసి పడుతున్న కెరటాలు

వదలని వాన!

జిల్లాలో వాన దంచికొడుతోంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మోస్తరు నుంచి భారీ వర్షం నమోదవుతోంది. గత రెండు రోజులుగా పెద్దగా ప్రభావం లేనప్పటికీ మంగళవారం సాయంత్రం నుంచి ఎడతెరిపి లేని వర్షం పడుతోంది. బుధ, గురువారాల్లో దీని ప్రభావం మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. దీంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. బుధవారం అన్ని విద్యాసంస్థలకు సెలవు ప్రకటించింది. అత్యవసరమైతే తప్ప ఎవ్వరూ బయటకు రావొద్దని హెచ్చరికలు జారీచేసింది.

కొనసాగుతున్న తుపాన్

- వాయుగుండ ప్రభావంతో అధికారుల అప్రమత్తం
- నేడు విద్యాసంస్థలకు సెలవు

తిరుపతి అర్బన్: భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ముంపు ప్రాంతాల్లో రక్షణ చర్యలు ముమ్మరం చేసింది. వరదలను సమర్థవంతంగా ఎదుర్కొనేలా ఏర్పాట్లు చేపట్టింది. అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేసింది. వాగులు, వంకల వద్ద నిత్యం అధికారులు పర్యవేక్షించేలా చర్యలు చేపట్టింది. తీర ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించింది.

జిల్లాలో 84.6 మి.మీ వర్షం

వాయుగుండ ప్రభావంతో ఈనెల 13వ తేదీ నుంచి మంగళవారం సాయంత్రం 6 గంటల వరకు జిల్లాలో 84.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. తడ మండలంలో అత్యధికంగా 166.5 మి.మీ, అత్యల్పంగా చిన్నగొట్టిగల్లు మండలంలో 36 మి.మీ వర్షపాతం నమోదైంది. సూళ్లూరుపేటలో 139.6, వాకాడులో 138.2, బీఎన్‌కండ్రిగ 114.4, వరదయ్యపాళెంలో 112.2, చిట్టమూరులో 106.1, చిల్లకూరులో 101.9, గూడూరులో 101.8, ఏర్పేడులో 100.8, శ్రీకాళహస్తిలో 97.3, కేవీబీపురంలో 96.5, వడమాలపేటలో 91.6, సత్యవేడులో 87.6, పుత్తూరులో 85.2, కోటలో 83.5, పెళ్లకూరులో 82.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

ప్రత్యేక చర్యల మాటేంటో?

జిల్లాలోని వరద ముంపు ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు నామమాత్రంగా కొనసాగుతున్నాయి. గత ఏడాది పేరూరు చెరువు నీటితో తిరుపతి నగరవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం ఆ చెరువు కరకట్ట బలహీనంగా ఉన్నా దాని పటిష్టతకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం ఆందోళన కలిగిస్తోంది. అలాగే తిరుపతి లక్ష్మీపురం సర్కిల్ వద్ద గతంలో మ్యాన్‌హోల్‌లో పడి ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. ఇప్పటికీ ఆ ప్రాంతంలో పలు మ్యాన్‌హోల్స్ అలానే ఉన్నాయి. అలాగే ఆటోనగర్, ఎస్టీవీ నగర్, చింతలసేను, ఎమ్మార్‌పల్లి, కొరమేనిగుంట, లక్ష్మీపురం ప్రాంతాల్లో ఎప్పుడు ఏ వరద ముంచెత్తుతుందో తెలియక స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.

పటిష్ట ఏర్పాట్లు

వాయుగుండ ప్రభావంతో పెద్ద ఎత్తున వర్షాలు వచ్చినా ప్రమాదాలు లేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాం. ప్రధానంగా ప్రాణ నష్టం, ఆస్తి నష్టంతోపాటు మూగ జీవుల ప్రాణాలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. మత్స్యకారులను వేటకు వెళ్లకుండా ఆదేశాలిచ్చాం. విద్యాసంస్థలకు సెలవు ప్రకటించాం. విపత్తులను ఎదుర్కోవడానికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టాం. సముద్రతీర ప్రాంతాలైన కోట, చిల్లకూరు, వాకాడు, సూళ్లూరుపేట, తడ మండలాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టాం.

– ఎస్.వెంకటేశ్వర్, కలెక్టర్, తిరుపతి జిల్లా

తుపాన్ కంట్రోల్ రూములు

కలెక్టరేట్	0877-2236007
గూడూరు ఆర్డీవో కార్యాలయం	86242 52807
సూళ్లూరుపేట ఆర్డీవో కార్యాలయం	86232 95345
తిరుపతి ఆర్డీవో కార్యాలయం	70321 57040
శ్రీకాళహస్తి ఆర్డీవో కార్యాలయం	99665 24952

చెరువులకు చేరని నీరు

రబీ సీజన్ ప్రారంభమవుతోంది. పంటల సాగుకు సమాయత్తమవుతున్నారు. అయితే జిల్లాలోని ఏ ఒక్క చెరువు పూర్తి స్థాయిలో నిండలేదు. కాళంగి, కల్యాణ్ డ్యామ్, అరణియార్, స్వర్ణముఖి, మల్లెమడుగు, కైవల్యనది, తొండమనాడు చెరువులకు అంతంతమాత్రంగానే నీరు చేరింది.

తీరంలో 'అల'జడి



బోట్ల వద్ద కాపలా కాస్తున్న మత్స్యకారులు

వాకాడు: ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో సముద్ర తీరం అల్లకల్లోలంగా మారింది. వాకాడు మండలం, తూపిలిపాళెం వద్ద మంగళవారం సముద్రపు కెరటాలు ఐదు మీటర్ల ఎత్తుకు ఎగసి పడుతున్నాయి. అలాగే దాదాపు 8 నుంచి 10 మీటర్ల వరకు సముద్రం ముందుకు రావడంతో సముద్ర తీరం కోతకు గరవుతోంది. ఉదయం నుంచి సముద్ర తీరంలో పెనుగాలులు తోపాటు ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. తీర ప్రాంతంలోని 14 గ్రామాల మత్స్యకారులు తమ బోట్లు, వేట సామగ్రిని ఒడ్డుకు చేర్చి లంగరు వేశారు. కొందరు లోతట్టు ప్రాంతాల మత్స్యకారులు తమ వేట సామగ్రిని మిట్ట ప్రాంతాలకు తరలించారు. వాకాడు తహసీల్దార్ రామయ్యతోపాటు ఎంపీడీఓ అన్నపూర్ణారావు తమ సిబ్బందితో ముంపు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. మత్స్యకారులను వేట వెళ్లనీకుండా, పర్యాటకులను ఎవ్వరినీ సముద్రం వద్దకు రాకుండా చర్యలు తీసుకుంటున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నాలుగు రోజులు పాటు సముద్రం వద్దకు ఎవ్వరినీ అనుమతించబోమని తహసీల్దార్ స్పష్టం చేశారు. 1,980 మత్స్యకార కుటుంబాలకు సంబంధించి దాదాపు 7,500 మంది మత్స్యకారులు ఉన్నారు. వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

ఎవ్వరూ వేటకు వెళ్లొద్దు



తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో ఈనెల 16వ తేదీ వరకు మత్స్యకారులు ఎవ్వరూ వేటకు వెళ్లరాదు. అధికారుల నుంచి ఆదేశాల వచ్చే వరకు మత్స్యకారులు తమ బోట్లను సురక్షిత ప్రాంతాల్లో భద్రపరుచుకుని ఇంటికే పరిమితమవ్వాలి.

– నాగరాజ, మత్స్యశాఖ జేడీ, తిరుపతి జిల్లా

మల్లిమడుగుకు చేరుతున్న నీరు



రేణిగుంట: తుపాను ప్రభావంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గ్రామీణ రోడ్లు బురమయంగా మారాయి. మండలంలోని కరకంబాడి దొడ్లమిట్ట సమీపంలో ఉన్న మల్లిమడుగు రిజర్వాయర్‌కు వర్షపునీరు వచ్చి చేరుతోంది. దీంతో పూర్తిగా ఎండిపోయి ఉన్న ఈ రిజర్వాయర్‌లో జలకళ సంతరించుకుంది. ఎంపీడీవో విష్ణుచిరంజీవి, డీటీ శ్యాంప్రసాద్ ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు.

ముంపు ప్రాంతాల్లో రక్షణ చర్యలు



తిరుపతి మంగళం : తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో ముంపు ప్రాంతాల్లో రక్షణ చర్యలు చేపట్టనున్నట్టు తిరుపతి జిల్లా రవాణాశాఖాధికారి మురళీమోహన్ తెలిపారు. ఈమేరకు ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. జిల్లాలోని ముంపు ప్రాంతాలైన వాకాడు, తూపిలపాళెం, చిల్లకూరు, నాయుడుపేట వంటి ప్రాంతాల్లో రవాణాశాఖ అధికారులను అప్రమత్తం చేయడంతో పాటు అక్కడ జేసీబీలు, క్రేన్‌లు, స్కూల్స్, కళాశాల బస్సులను అందుబాటులో ఉంచినట్టు వెల్లడించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

భాకరాపేట : భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తిరుపతి ఆర్డీవో రామ్మోహన్ సూచించారు. మంగళవారం చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలాల్లోని అన్ని శాఖల అధికారులతో ఆయన సమావేశమై పలు సూచనలు చేశారు. మండల కేంద్రాల్లో పునరావాస కేంద్రాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. చెరువులు, వంకల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఎర్రావారిపాళెం మండలంలో గాజులేరు, కప్పలేరు తదితర ప్రాంతాలను ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్, ఇరిగేషన్, పోలీస్ అధికారులు పర్యవేక్షించాలన్నారు. తహసీల్దార్ జనార్దన్‌రాజు, ఎంపీడీవో గిడ్డయ్య, ఈవోపీఆర్‌డీ సోమశేఖర్‌రెడ్డి, ఆర్‌ఐ వాసుదేవకుమార్, ఏఎస్‌ఐ శివప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రమణ్యం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ రామ్మోహన్

తిరుమలలో ఎడతెరిపిలేని వర్షం




తిరుమల : తిరుమలలో మంగళవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. తిరుమల శ్రీవారిని దర్శించుకున్న భక్తులు ఆలయం వెలుపలకు రాగానే పరుగులు తీయడం కనిపించింది. కొండపై చలి తీవ్రత కూడా పెరిగింది. వర్షం కారణంగా చాలామంది చలువ పందిళ్ల కింద తలదాచుకుంటున్నారు. శ్రీవారి ఆలయ పరిసరాలు నిర్మానుష్యంగా మారాయి. దుకాణాలన్నీ మూత పడ్డాయి.

వేరుశనగ రైతులకు మెలకువలు

తిరుపతి సిటీ: అధిక వర్షాలలో వేరుశనగ రైతులు అప్రమత్తంగా ఉండాలని తిరుపతి ప్రాంతీయ వ్యసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు సూచించారు. పంట నూర్పిడి చేసి పొలంలోనే ఉంచిన పరిస్థితిలో గింజలు మొలకెత్తకుండా ఉండేందుకు చెట్ల మొదళ్లను నిటారుగా నిలబెట్టాలన్నారు. పీకిన వేరుశనగ చెట్లపై టార్పాలిన్ పట్టలు కప్పాలని చెప్పారు. విత్తనం వేసిన దశలో వీలైనంత తొందరగా పొలం నుంచి నీటిని పూర్తిగా బయటకు తీసివేయాలన్నారు.

'రండి బాబూ..రండి.. నేటి నుంచే.. నారా వారి సారా..! మీకోసం నాణ్యమైన చీప్ లిక్కర్లు తెచ్చాం. తాగినోడికి తాగినంత.. సమయం.. సందర్భం లేదు.. ఎప్పుడైనా.. ఎక్కడైనా విక్రయిస్తాం. ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు మీ సేవలో తరిస్తాం. భార్య మెడలో పుస్తెలైనా అమ్మండి.. మద్యం విక్రయాలు పెంచండి!.. ఇదీ.. సీఎం చంద్రబాబు తెచ్చిన మద్యం పాలసీ తీరు. కొత్త బ్రాండ్లు.. కొత్త మద్యం పాలసీ.. అంటూ ఊదరగొట్టి లాటరీల ముసుగులో తమ వాళ్లకే షాపులు కట్టబెట్టేశారు. ఇక నేటి నుంచి డబ్బు సంపాదనే లక్ష్యంగా పావులు కదుపుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడేందుకు సిద్ధమైపోయారు. దీనిపై జిల్లా ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచే.. నారా వారి సారా!



తాగండి.. తూగండి.. తన్నుకుచావండి!

- మార్కెట్లో రకరకాల మద్యం బ్రాండ్లు
- రూ.99కి ట్రోఫికోనా, కేరళా మాల్టెడ్ వంటి లిక్కర్స్
- పెట్టుబడి.. పోగొట్టుకున్న నష్టాన్ని రాబట్టడమే లక్ష్యం
- ఊరూవాడా తెరుచుకోనున్న బెల్టు షాపులు
- పర్మిట్ రూమ్‌లకు త్వరలో నోటిఫికేషన్

సాక్షి టాస్క్‌ఫోర్స్: నయానో..భయానో దాదాపు మద్యం దుకాణాలన్నీ కూటమి నేతలే దక్కించుకున్నారు. తమ కనుసన్నల్లో నడిచేవారికి అక్కడక్కడా కొన్ని దుకాణాలు వచ్చేలా ఏర్పాట్లు చేపట్టారు. మొత్తం మీద మద్యం షాపులన్నీ అధికార పార్టీ నేతలే సొంతం చేసుకున్నారు. స్థానిక ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో నడవనున్న మద్యం దుకాణాలు నేటి నుంచి బార్లా తెరుచుకోనున్నాయి. పెట్టిన పెట్టుబడి.. టెండర్ల కోసం పోగొట్టుకున్న నగదును రాబట్టుకోవడమే లక్ష్యంగా మద్యం సిండికేట్లు ముందుకు సాగనున్నారు. మొదటి విడతలో రాష్ట్రంలో ఎక్కడా లేని ఒక్క తిరుపతి జిల్లాకే 227 దుకాణాలు కేటాయించారు. తర్వాత చిత్తూరు జిల్లాకు 104 షాపులు కేటాయించారు.

ఆరోగ్యం అనవసరం..సంపాదనే ముఖ్యం!

మద్యం దుకాణాలు దక్కించుకునేందుకు అధికారపార్టీ నేతలు బినామీల ముసుగులో ఒక్కొక్కరూ వందల సంఖ్యలో దరఖాస్తులు చేశారు. తిరుపతి నగరంలోని 32 దుకాణాలకు స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు బినామీ పేర్లతో 350 దరఖాస్తులు చేశారని ప్రచారం జరుగుతోంది. అంటే రూ.7 కోట్లు వెచ్చించినట్లు సమాచారం. ఈ మొత్తాన్ని రాబట్టుకునేందుకు లాటరీ ద్వారా దుకాణాలు దక్కించుకున్న వారందరితో సమావేశమై.. అంతా కలసి మెలిసి వ్యాపారం చేసుకుందామని ఒత్తిడి చేసి ఒప్పించినట్లు కూటమి నేతలు చర్చించుకుంటున్నారు. సిండికేట్‌గా మారి ఒకటే మాట.. ఒకటే ధరపై మద్యాన్ని విక్రయించి సొమ్ముచేసుకుందామని ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం. అదేవిధంగా అత్యధికంగా మద్యం అమ్మకాలు జరిగే ప్రాంతాలైన శ్రీకాళహస్తి, గూడూరు, సూళ్లూరుపేట, సత్యవేడు, నగరి, గంగాధరనెల్లూరు, చిత్తూరు, పలమనేరు, కుప్పం నియోజక వర్గాల్లోని మద్యం విక్రయాలపై అధికారపార్టీ నేతలు ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. వేళాపాళా లేకుండా మద్యం విక్రయించాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం.

మద్యం కొనండి..పుస్తెలైనా అమ్మండి!

వీలైనంత మంది ఎక్కువ మద్యం కొనుగోలు చేసుకునేలా ఊరూ వాడా బెల్టు దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్లు సమాచారం. బెల్టు దుకాణం కావాలనుకున్న వారు కొంత మొత్తాన్ని డిపాజిట్ రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. ఎవరు ఎక్కువ చెల్లిస్తే వారు బెల్టు దుకాణం ఏర్పాటు చేసుకునే వెసులుబాటు కల్పించనున్నారు. ఇదిలా ఉంటే.. గత ప్రభుత్వ పాలనలో ఉదయం 11 నుంచి రాత్రి 10 గంటల వరకు దుకాణాలు తెరుచుకోవాలి. అంతకు ముందు.. ఆ తరువాత మద్యం దుకాణాలు తెరవడానికి వీల్లేదు. అయితే కూటమి ప్రభుత్వం ఆ సమయంలో మార్పులు చేసింది. ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు తెరుచుకునే అవకాశం కల్పించారు. గుడి-బడికి వంద మీటర్ల దూరం వరకు, జాతీయ రహదారులకు 500 మీటర్ల వరకు దుకాణాలు పెట్టకూడదనే నిబంధన ఉన్నా.. కొన్ని చోట్ల వాటికి తూట్లు పొడిచి దుకాణాలు తెరిచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇది చాలదన్నట్టు త్వరలో పర్మిట్ రూంలు కూడా ఏర్పాటు చేసుకునే అవకాశాలు మెండుగా ఉన్నట్లు తెలుస్తోంది.



బాబు 'బ్రాండ్'



దేశంలో ఏ అధికార పార్టీ ఇవ్వని విధంగా ప్రజలకు క్వాలిటీ మద్యాన్ని అతి తక్కువ ధరకే ఇస్తామని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే డబ్బే పరమావధిగా క్వాలిటీ విషయాన్ని పక్కనబెట్టి తక్కువ ధరకు చీప్ లిక్కర్‌ని మార్కెట్లోకి తీసుకొస్తున్నట్లు తెలుస్తోంది. ఎక్సైజ్ అధికారుల సమాచారం మేరకు నేటి నుంచి ట్రోఫికోనా అనే చీప్ లిక్కర్‌తో పాటు మరి కొన్ని రకాల మద్యం బ్రాండ్లను విక్రయించనున్నట్లు తెలుస్తోంది. మరి కొన్ని రోజుల్లో 'కేరళ మాల్టెడ్' వంటి చీఫ్ క్వాలిటీ మద్యం మార్కెట్లోకి తీసుకురానున్నారు. ఈ మద్యం కూడా తిరుపతి జిల్లాలోనే తయారు కానుంది. వీటితో పాటు అనేక రకాల చీప్ లిక్కర్ బ్రాండ్లను మార్కెట్లోకి తీసుకొచ్చేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలుస్తోంది.

రైల్వే లైన్ విస్తరణకు సహకరించండి

రేణిగుంట: రైల్వే లైన్ విస్తరణకు సహకరించి నివాసాలను ఖాళీ చేసి సహకరించాలని శ్రీకాళహస్తి ఆర్‌డీఓ భానుప్రకాష్‌రెడ్డి తెలిపారు. తూకివాకం పంచాయతీ, ఏఎస్‌ఆర్ కాలనీ(నక్కల కాలనీ) సమీపంలో పుత్తూరు-తిరుపతి రైల్వే లైన్ విస్తరణలో భాగంగా కాలనీలోని ఇళ్లు పోతాయని, వాటికి ప్రత్యామ్నాయంగా ఇంటి స్థలాలను కేటాయించి ఇళ్లు నిర్మించి ఇస్తామని ఆయన బాధితులకు వివరించారు. అలాగే రేణిగుంట-నాయుడుపేట 6 లేన్ల రహదారి విస్తరణ పనుల్లో భాగంగా శ్రీకాళహస్తి మండలం, కాపుగున్నేరి సమీపంలో చిరంజీవి, యశోదమ్మ ఇళ్ల వద్ద సర్వీసు రోడ్డు వేసేందుకు సహకరించాలన్నారు.



కాపుగున్నేరి సమీపంలో బాధితులతో మాట్లాడుతున్న అధికారులు

క్లుప్తంగా

వైభవంగా ప్రదోష పూజలు



ప్రదోష మండపంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి శ్రీ పళ్లికొండేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ప్రదోష పూజలు వైభవంగా నిర్వహించారు. అర్చకులు నందీశ్వర స్వామికి, శ్రీవాల్మికీశ్వర స్వామికి ఏక కాలంలో పుజలు నిర్వహించారు. ఈ ప్రదోష పూజలకు నింద్ర గ్రామానికి చెందిన శ్రీనివాస మిల్క్ డెయిరీ ఎండీ వాసుదేవనాయుడు, వారి కుటుంబ సభ్యులు ఉభదారులుగా వ్యవహరించారు. వారికి ఆలయ మర్యాదలతో దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి పి.లత, పాలక మండలి సభ్యులు ఆనందయ్య పాల్గొన్నారు.

ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ



పగులగొట్టిన బీరువా

కలువాయి: ఎవరూ లేని సమయంలో ఇంటి తాళాలు పగులగొట్టి నగదు, నగలు దోచుకెళ్లిన ఘటన కలువాయిలో కలకలం రేపింది. వివరాలు. కలువాయి నడిమివీధిలో నివాసముంటున్న శ్రీనివాసులురెడ్డి ఇంట్లో సోమవారం రాత్రి దొంగలు పడ్డారు. ఇంటి తాళాలు పగులగొట్టి, రెండు సవర్ల బంగారు నగలు, రూ.90 వేల నగదు అపహరించుకెళ్లారు. మంగళవారం ఉదయం ఇంటి ముంగిట శుభ్రం చేసేందుకు పనిమనిషి వెళ్లగా ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. వెంటనే విషయాన్ని శ్రీనివాసులు రెడ్డికి తెలియజేయగా.. ఆయన కలువాయి పోలీసులు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది. ఇదిలావుండగా నాలుగు రోజుల క్రితం కలువాయికి చెందిన ఉపాధ్యాయుడు యడ్లసురేష్ ఇంట్లోనూ నగలు, నగదు అపహరించుకువెళ్లారు. వరుస దొంగతనాలతో స్థానికులు హడలిపోతున్నారు.

పీజీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్ల గడువు పొడిగింపు

తిరుపతి సిటీ: శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీలో ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ పీజీ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్లు గడువు తేదీలు పొడిగిస్తున్నట్లు రిజిస్ట్రార్ భూపతి నాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నత విద్యామండలి ఆదేశాల ప్రకారం పీజీ సెట్–2024లో అర్హత సాధించిన విద్యార్థులు ఈనెల 21లోపు స్పాట్ అడ్మిషన్లు పొందవచ్చని తెలియజేశారు. వివరాలకు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ రమేష్ బాబును 0877–2248589 నంబరులో సంప్రదించాలని సూచించారు.

నకిలీల రాజ్యం.. అధికారుల దాసోహం!



వెంకటగిరిలోని అగ్రిల్యాబ్



సూళ్లూరుపేటలోని అగ్రి ల్యాబ్

పట్టెడన్నం పెట్టే అన్నదాతకు కూటమి నేతలు పుట్టెడు కష్టాలు మిగిల్చారు. రైతుకు వెన్నుదన్నుగా నిలుస్తున్న అగ్రిల్యాబ్‌లను గాలికొదిలేశారు. రైతు భరోసా కేంద్రాల పేరు మార్చి సేవలకు దూరం చేశారు. తామేమీ తక్కువ కాదంటూ సంబంధిత అధికారులు సైతం నకిలీలతో అంటకాగుతూ కమీషన్లకు కక్కుర్తి పడి తనిఖీలకు ఫుల్‌స్టాప్ పెట్టేశారు. ఇదే అదునుగా కేటుగాళ్లు నకిలీ విత్తనాలు, ఎరువులను అన్నదాతలకు అంటగడుతూ జేబులు నింపుకుంటున్నారు. ఇప్పుడు జిల్లాలో ఎక్కడ చూసినా ఇలాంటివే వెలుగు చూడడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది.

- జిల్లాలో రాజ్యమేలుతున్న నకిలీ విత్తనాలు, ఎరువులు
- తనిఖీలకు ఫుల్‌స్టాప్ పెట్టేసిన వ్యవసాయశాఖ!
- అలంకారప్రాయంగా అగ్రిల్యాబ్‌లు
- రైతు సేవా కేంద్రాలకు అందని ఎరువులు
- అయోమయంలో అన్నదాతలు

తిరుపతి అర్బన్: జిల్లాలో నకిలీ కేటుగాళ్లు రాజ్యమేలుతున్నారు. కూటమి నేతల ఉదాసీనత, అధికారుల అలసత్వాన్ని అదునుగా చేసుకుని అన్నదాతలను నష్టాల ఊబిలోకి నెట్టేస్తున్నారు. ఇటీవల వరదయ్యపాళెం మండలంలో నకిలీ వరి విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు నిలువునా మోసపోయినా సంబంధిత వ్యాపారులపై చర్యలు చేపట్టడంలో అధికారులు మీనమేషాలు లెక్కించడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. కేవలం నో సేల్స్ నోటీసులిచ్చి చేతులు దులుపుకోవడం చర్చనీయాంశమైంది.

పరీక్షలు నిల్

గత ప్రభుత్వంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలనే ఉద్దేశంతో అగ్రి ల్యాబ్‌లను ఏర్పాటు చేశారు. శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, వెంకటగిరి, గూడూరు, సత్యవేడు ప్రాంతాల్లో అగ్రి ల్యాబ్‌లను అందుబాటులోకి తీసుకొచ్చారు. రైతులకు అందిస్తున్న విత్తనాలు, ఎరువులను పరీక్షలు చేసి, వాటి ఫలితాల ఆధారంగా పంటలు సాగుచేసుకునే వెసులుబాటు కల్పించారు. విత్తనాలపై రెండు వేల శ్యాంపుల్స్, ఎరువులపై వెయ్యి శ్యాంపుల్స్ చేపట్టారు. కూటమి సర్కారు గద్దెనెక్కిన తర్వాత అగ్రిల్యాబ్‌ల్లో పరీక్షలను పక్కన పెట్టేశారు.

జిల్లా సమాచారం	
విత్తనాలు విక్రయించే దుకాణాలు	120
పురుగు మందుల దుకాణాలు	282
ఎరువుల దుకాణాలు	234
లైసెన్స్ లేకుండా అనధికారంగా ఉన్న దుకాణాలు	100

చర్యలేవీ?

జిల్లా వ్యాప్తంగా 34 మండలాల్లోని విత్తనాలు, ఎరువుల దుకాణాల్లో తనిఖీలు చేయాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడంలేదు. నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు చేస్తున్న దుకాణదారులపై చర్యలు చేపట్టాల్సిందిపోయి మామూళ్ల మత్తులో జోగుతున్నారు. దీనిపై కొందరు అన్నదాతలు సంబంధిత అధికారులను నిలదీయగా ఇటీవల జిల్లా కలెక్టరేట్‌లో వ్యవసాయశాఖ కార్యాలయం వద్ద సమావేశాలు నిర్వహించి, సూచనలిచ్చి పంపించేయడం గమనార్హం.

ఎరువులు కుదించేశారు!

గత ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి, అవసరమైన ఎరువులను అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో ఆయా గ్రామాల్లోని రైతులు వారి ఇంటి వద్దే ఎరువులు కొనుగోలు చేసేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చి చేతులుదులుపుకున్నారు. ఏపీ మార్క్‌ఫెడ్‌కు, రైతు సేవా కేంద్రాలకు కాకుండా సొసైటీలకు ఎరువులను అధిక శాతం అందించాలని ఆదేశాలిచ్చారు. మండల కేంద్రంలోని సొసైటీల్లో ఎరువులు తెచ్చుకుందామని భావిస్తే.. అక్కడ టీడీపీ నేతల ఆదేశాల మేరకు విక్రయాలు చేస్తుండడంతో ఏం చేయాలో తెలియక రైతులు తలలు పట్టుకుంటున్నారు.



జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో ఎరువులు, విత్తనాల డీలర్లతో సమావేశం(ఫైల్)

తనిఖీలు చేస్తున్నాం



ఎరువులు, విత్తనాల దుకాణాలను తనిఖీలు చేస్తున్నాం. నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై చర్యలు తీసుకుంటాం. వరదయ్యపాళెంలోని విత్తనాలకు సంబంధించి నో సేల్స్ నోటీసులు ఇచ్చి, విత్తనాలను పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపించాం. లోటుపాట్లు సవరించి అగ్రిల్యాబ్‌లను అందుబాటులోనే ఉంచుతాం. ఈ రబీకి 1,01,082 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం. ప్రస్తుతం 17,086 మెట్రిక్ టన్నులు నిల్వ ఉన్నాయి. మిగతా ఎరువులు తెప్పిస్తాం.

–ఎస్.ప్రసాద్‌రావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

విచ్చలవిడిగా నకిలీ విత్తనాలు, ఎరువులు

జిల్లాలో నకిలీ విత్తనాలు, ఎరువులు విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. వ్యవసాయశాఖ అధికారులు ప్రతి నెలా రెండు సార్లు అగ్రిల్యాబ్‌లతోపాటు విత్తనాలు, పురుగు మందులు, ఎరువుల దుకాణాలను పరిశీలించాల్సి ఉంది. 80 శాతానికి పైగా మొలకలు వస్తేనే సంబంధిత వంగడాలను విక్రయించాల్సి ఉంటుంది. అయితే కమీషన్లకు కక్కుర్తిపడిన అధికారులు తనిఖీలను అటకెక్కించేశారు. దీంతో అన్నదాతలు నకిలీల యామలో పడి నిలువునా మోసపోతున్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఫారెస్ట్ అధికారి



కలెక్టర్‌తో ఫారెస్ట్ అధికారి వివేక్

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌ను జిల్లా ఫారెస్ట్ అధికారి వివేక్ కలిశారు. నూతనంగా జిల్లా అటవీశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన ఆయన మర్యాదపూర్వకంగా కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

18న రాష్ట్ర స్థాయి సదస్సు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ నేతలు

తిరుపతి కల్చరల్: కేంద్రం ప్రభుత్వ కార్మికవర్గ వ్యతిరేకంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లు, మూడు నేర చట్టాలకు వ్యతిరేకంగా విజయవాడలోని ఎంబీవీకే భవన్‌లో ఈనెల 18న నిర్వహించే రాష్ట్ర స్థాయి సదస్సును జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షురాలు జీ.భారతి పిలుపు నిచ్చారు. ఈమేరకు మంగళవారం ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఆమె సంబంధిత నేతలతో కలిసి రాష్ట్ర సదస్సు పోస్టర్లను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ స్వదేశీ, విదేశీ కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా కార్మిక వర్గం ఉద్యమించినా, గొంతెత్తి ప్రశ్నించినా శిక్షించడానికి అనుకూలంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చట్టాలను మార్చిందన్నారు. హమాలీ రంగాల కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్న డిమాండ్ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ సీనియర్ నేత పీ.వెంకటరత్నం, నగర కార్యదర్శి రుద్రగోపి, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పీ.రాణి, అంగన్‌వాడీ జిల్లా నేతలు శోభ, శాంతకుమారి, సుజాత, నందిని, రెడ్డెమ్మ, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

‘పచ్చ’పైత్యం!

- శిలాఫలకానికి సైతం పచ్చరంగు
- సర్పంచ్‌కి అందని ఆహ్వానం
- గ్రామస్తుల విస్మయం



వేదికపై ఎమ్మెల్యేతో పాటు టీడీపీ నేతలు

శ్రీకాళహస్తి రూరల్: ప్రభుత్వ కార్యక్రమాన్ని పార్టీ కార్యక్రమంగా మార్చేశారు. పంచాయతీ ప్రథమ పౌరురాలికి ఆహ్వానం అందకుండా తీవ్రంగా అవమానించారు. అంతటితో ఆగక సమావేశంలో టీడీపీ నేతలకే పెద్ద పీట వేశారు. సభావేదికపై వారికే సింహ భాగం సీట్లు కేటాయించారు. ఆపై శిలాఫలకానికి సైతం పచ్చరంగు పూసి స్థానికులను విస్మయానికి గురిచేసిన ఘటన శ్రీకాళహస్తి మండలంలో చర్చనీయాంశమైంది.

అసలేం జరిగిదంటే!

శ్రీకాళహస్తి మండలం, బీ.వెంకటాపురంలో మంగళవారం పల్లెపండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు. పంచాయతీలో రూ.10 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. తర్వాత జరిగిన సమావేశంలో ఆయన పక్కన టీడీపీ నేతలే కూర్చొనే విధంగా ఏర్పాట్లు చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన శిలాఫలకానికి సైతం అధికారులు పచ్చ రంగు వేసి ఉండడంతో ఔరా..! అంటూ స్థానికులు ముక్కున వేలేసుకున్నారు.

బాధాకరం

పంచాయతీలో జరుగుతున్న అభివృద్ధి పనుల శంకుస్థాపనకు స్థానిక సర్పంచ్‌కు ఆహ్వానం అందించకపోవడం దారుణం. పార్టీ కార్యక్రమం అయితే మేము పట్టించుకోము. ప్రభుత్వ కార్యక్రమం జరిగేటప్పుడు కనీస సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత లేదా..?. అధికారులపై చర్యలు తీసుకోవాలి. – మౌనిక, సర్పంచ్

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి సిటీ: ఎస్వీయూలో ఎంటెక్ (కెమికల్, సివిల్, కంప్యూటర్, ఎలక్ట్రికల్, కమ్యూనికేషన్స్, మెకానికల్ ఇంజినీరింగ్) కోర్సులలో, ఫార్మసీ కళాశాలలో ఎమ్‌ఫార్మసీ, బీఫార్మసీ కోర్సులలో పేమెంట్ సీట్ల భర్తీ ప్రక్రియ చేపట్టనున్నట్లు రిజిస్ట్రార్ భూపతినాయుడు తెలిపారు. ఆసక్తి, అర్హత గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కేటగిరిలో ఎంటెక్‌లో అడ్మిషన్ పొందడానికి గేట్ –2024 మొదటి ప్రాధాన్యత, పీజీ ఈసెట్ –2024 రెండవ ప్రాధాన్యత, కేవలం బీటెక్ అర్హత ఉన్నవారికి చివరి ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు తెలిపారు. అలాగే ఎంఫార్మసీలో చేరడానికి జీ ఫ్యాట్ 2024 అర్హత సాధించిన వారికి మొదటి ప్రాధాన్యత, పీజీ ఈసెట్ –2024 అర్హత ఉన్నవారికి రెండవ ప్రాధాన్యత, కేవలం బీఫార్మసీ ఉన్నవారికి చివరి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. బీఫార్మసీలో చేరడానికి ఈఏపీసెట్ –2024 రాసిన వారికి మొదటి ప్రాధాన్యత, కేవలం ఇంటర్మీడియెట్ అర్హతగల వారికి చివరి ప్రాధాన్యత కలిప్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

డీపీటీఓ బదిలీ

చిత్తూరు డీపీటీఓకు అదనపు బాధ్యతలు



తిమ్మాడి చెంగల్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆర్టీసీ అధికారులు

తిరుపతి అర్బన్: జిల్లా ప్రజారవాణాధికారి(డీపీటీఓ)తిమ్మాడి చెంగల్‌రెడ్డి పదోన్నతి నేపథ్యంలో విజయవాడ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఆయన తిరుపతి, ఉమ్మడి చిత్తూరు జిల్లా డీపీటీఓగా ఎనిమిదేళ్లపాటు పనిచేశారు. ఆర్టీసీ అభివృద్ధికి పలు సేవలందించారు. ఆర్టీసీ అధికారులు తిరుపతిలోని ఆయన కార్యాలయంలో తిమ్మాడి చెంగల్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా డెప్యూటీ చీఫ్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్, జిల్లా మెకానికి ఇంజినీర్ నరసింహులు, 11 డిపోల మేనేజర్లు, అసిస్టెంట్లు మేనేజర్లు హాజరైనారు. చిత్తూరు జిల్లా డీపీటీఓగా పనిచేస్తున్న జగదీప్‌కు తిరుపతి డీపీటీఓగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

విజన్ డాక్యుమెంట్ రూపకల్పనపై సమీక్ష



స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్స్‌పై ఐఐటీ నిపుణులతో చర్చిస్తున్న కలెక్టర్, జేసీలు

తిరుపతి అర్బన్: స్వర్ణాంధ్ర–2047 విజన్ డాక్యుమెంట్స్‌ను తయారు చేయడానికి తిరుపతి ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణతోపాటు పలువురు సబ్జెక్ట్ నిపుణులతో వర్చువల్ పద్ధతిలో చర్చించారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్ పలువురు అధికారులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఐఐటీ నిపుణులతో వర్చువల్ విధానంలో సలహాలు తీసుకున్నారు. ప్రధానంగా జిల్లా గ్రోత్ రేట్ 15 శాతం పైన ఉండేలా డాక్యుమెంట్స్ తయారీ విధానంపై చర్చించారు. పర్యాటక రంగంతో పాటు విద్యా, పరిశ్రమలు, మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్స్ ప్రమోషన్, ఎలక్ట్రానిక్ హబ్‌గా, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తదితర అంశాలపై పూర్తి స్థాయిలో ఆచరణాత్మక జిల్లా విజన్ డాక్యుమెంట్ తయారీకి ఐఐటీ వారి సూచనలు ఎంతగానో దోహదం చేస్తాయని కలెక్టర్ భావించారు. స్వర్ణాంధ్ర–2047కు సంబంధించి ఇప్పటి వరకు మండల, డివిజన్, జిల్లా స్థాయిలో చేపట్టాల్సిన అంశాలపై సుమారు 70 వేలకు పైగా అభిప్రాయం పంపించారు. సమావేశంలో జిల్లా ప్రణాళికా అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ప్రసాద్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పోకిరీ చేష్టలతో జీవితం నాశనం

- మళ్లీ తప్పు జరిగితే ఉపేక్షించం
- మైనర్లు, తల్లిదండ్రులకు పోలీసుల హెచ్చరిక

గూడూరు రూరల్: చిన్న తనంలో పోకిరీ చేష్టల వల్ల తప్పు జరిగితే చర్యలు తప్పవని గూడూరు డీఎస్పీ రమణకుమార్ హెచ్చరించారు. రెండో పట్టణ పోలీస్ స్టేషన్లో ఆయన మంగళవారం విలేకర్ల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం ఓ యువకుడిపై కొంతమంది అల్లరి మూకలు దాడి చేసినట్లు సోషల్ మీడియాలో హల్‌చల్ చేసిన ఘటనపై వివరాలను వెల్లడించారు. ఈ ఘటన ఆగస్టులో జరిగిందని, అయితే దీన్ని ఓ యువకుడు ఆ వీడియోను ఇటీవల సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయడంతో అది వెలుగు చూసిందన్నారు. ఈ ఘటనలో బాధితుడిగా ఉన్న యువకుడితో పాటు దాడికి పాల్పడిన వారు కూడా మైనర్లని తెలిపారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఘటనలో పాల్గొన్న అందరినీ పిలిపించి వారికి, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట 1, 2 పట్టణ సీఐలు శేఖర్‌బాబు, శ్రీనివాస్ ఉన్నారు.

ఘనంగా ప్రదోష నంది సేవ



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం ఘనంగా ప్రదోష నంది సేవ నిర్వహించారు. స్వామి అమ్మవార్లను విశేషంగా అంకరించి పూజలు చేశారు. అనంతరం నందిపై ఆదిదంపతులన అధిష్టింపజేసి ప్రాకారోత్సవం చేపట్టారు.

కొనసాగుతున్న మత్స్య సంపద దోపిడీ



తూపిలిపాళెం తీరం దగ్గర్లో వేట సాగిస్తున్న పొరుగు రాష్ట్రాల స్టీమ్ బోట్లు

వాకాడు: మత్స్య సంపద దోపిడీ యథేచ్ఛగా కొనసాగుతోంది. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో స్థానిక మత్స్యకారులు ఇంటికే పరిమితమయ్యారు. ఇదే అదునుగా తూత్తుకుడి, పాండిచ్చేరి, నాగలాపురం తదితర ప్రాంతాలకు చెందిన దాదాపు 57 స్టీమ్ బోట్లు హద్దులు దాటి మరి వాకాడు మండలం తూపిలిపాళెం, కొండూరుపాళెం, శ్రీనివాసపురం సముద్ర తీరంలో వేట సాగించి మత్స్య సంపదను వంద టన్నుల కొద్దీ దోచుకున్నారని తూపిలిపాళెం మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు నెలలుగా సముద్రంపై వేట లేకపోవడం, మరోపక్క ప్రభుత్వం నుంచి అందాల్సిన వేట నిషేధ భృతి ఇంతవరకు అందకపోవడం, ఉన్న మత్స్య సంపదను పొరుగు రాష్ట్రాల స్టీమ్ బోట్ల మత్స్యకారులు దోచుకుపోవడం వెరసి కష్టాలు పడాల్సి వస్తోందని వాపోయారు.

భూసేకరణపై చర్చ



భూసేకరణపై వర్చువల్‌గా రైల్వే అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్, జేసీ

తిరుపతి అర్బన్: జాతీయ రహదారులతోపాటు రైల్వే నూతన లైన్ల ఏర్పాటుకు చెందిన భూసేకరణ అంశాలపై కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అధికారులతో చర్చించారు. మంగళవారం పాకాల, చంద్రగిరి, తిరుపతి రూరల్ పరిధిలో 37 ఎకరాల వరకు భూసేకరణ చేపట్టాలని సౌత్ సెంట్రల్ రైల్వేస్, సికింద్రాబాద్ వారు వర్చువల్ విధానంలో కలెక్టర్‌తో మాట్లాడారు. అనంతరం కలెక్టరేట్ నుంచి జేసీ శుభం బన్సల్‌తో కలసి తిరుపతి కాట్పాడి రైల్వేట్రాక్ డబుల్ లైన్ నూతన ప్రాజెక్ట్ అమలులో భాగంగా తిరుపతి జిల్లాలో తిరుపతి నుంచి పాకాల రైల్వే ట్రాక్ డబుల్ లైన్‌కు 45 కిలోమీటర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం శ్రీకాళహస్తి–నడికుడి మధ్య రైల్వేలైన్ ఏర్పాటుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న 182 ఎకరాలు, తిరుపతి–నాయుడుపేట జాతీయ రహదారికి సంబంధించి పెండింగ్‌లోని భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ జీ సెక్షన్ డీటీ భాస్కర్ పాల్గొన్నారు.

వియత్నాం సదస్సుకు పేటశ్రీకి ఆహ్వానం



రిటైర్డ్ ప్రొఫెసర్ పేట శ్రీనివాసులు రెడ్డి

తిరుపతి సిటీ: వియత్నాంలోని నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ ఆర్ట్స్ ఎడ్యుకేషన్ వేదికగా ఎమర్జింగ్ ట్రెండ్స్ అండ్ ఇన్నోవేషన్స్ అనే అంశంపై ఈనెల 21 నుంచి 23 వరకు జరిగే అంతర్జాతీయ సదస్సుకు ఎస్వీయూ రిటైర్డ్ ప్రొఫెసర్ పేట శ్రీనివాసులు రెడ్డికి ఆహ్వానం అందింది. సదస్సులో పాల్గొని ఆయన ‘పవిత్ర పుణ్యక్షేత్ర తిరుపతి జానపదకళలు’ అనే అంశంపై పరిశోధనా పత్రాలు సమర్పించనున్నారు.

‘కోన’ కనువిందు!



భారీ వర్షాల నేపథ్యంలో ఎర్రావారిపాళెంలోని తలకోన జలపాతం కనువిందు చేస్తోంది. శిరోద్రోణం, నెలకోన మడుగులో నీటి ప్రవాహం పర్యాటకులను కట్టిపడేస్తోంది. అయితే ప్రమాద హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అటువైపు ఎవ్వరినీ వెళ్లనీయడం లేదు.

– భాకరాపేట



శిరోద్రోణం జలపాతంలో జాలువారుతున్న నీరు